సింగరేణి పాఠశాలకు బస్సులు నడపాలి

- విద్యార్థులకు సరిపడా బస్సుల నదుపాయం కల్పించని సింగరేణి యాజమాన్యం



ఆర్టీసీ బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాలకు మూడు బస్సులు నడపాలని సీఐటీయూసీ ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి కుంట ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈఏడాది నుంచి సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈలో బోధన ప్రారంభించడంతో పాఠశాలలో ఎక్కువ మంది సింగరేణి కార్మికుల పిల్లలు అడ్మిషన్లు పొందారు. వారికి సరిపడా బస్సులు సింగరేణి యజమాన్యం కల్పించకపోవడంతో చాలా మంది విద్యార్థులు ప్రైవేట్, ఆర్టీసీ బస్సుల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. బుధవారం వివేకానంద చౌరస్తా వద్ద సింగరేణి పాఠశాల విద్యార్థులు ఆర్టీసీ బస్సుల కోసం ఎదురుచూస్తుండడంతో సీఐటీయూసీ నాయకులు కుంట ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. గతంలో పాఠశాలకు బస్సులు నడపాలని ఎన్నోసార్లు సింగరేణి యజమాన్యానికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కొన్నినెలల క్రితం సింగరేణి పాఠశాలకు మూడుబస్సుల కోసం టెండర్లు వేసినా.. చర్యలు చేపట్టడంలో యజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా టెండర్లు పిలిచి మూడుబస్సులు నడపాలని కోరారు.

ఈపీ ఆపరేటర్లకు పదోన్నతి


ఈపీ ఆపరేటర్లు (ఫైల్)

గోదావరిఖని: సింగరేణి ఓసీపీల్లో పనిచేసే ఈపీ ఆపరేటర్లకు పదోన్నతి కల్పిస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. సంస్థ వ్యాప్తంగా సుమారు 150 మంది పదోన్నతి పొందనున్నారు. ఎక్స్ కవేషన్ కేటగిరీ–డిలో రెండేళ్లు పూర్తి చేసినవారికి ఎక్స్‌కవేషన్ కేటగిరీ–సి, ఎక్స్ కవేషన్ కేటగిరీ–సిలో మూడేళ్లు సర్వీసు పూర్తి చేసినవారికి ఎక్స్ కవేషన్ కేటగిరీ–బి పదోన్నతులు ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది.

గతంలో ఇలా..

గతంలో ఈపీ ఆపరేటర్లు ఎక్స్ కవేషన్ కేటగిరీ–డిలో రెండేళ్లు పనిచేసిన తర్వాత ప్రాక్టికల్ పరీక్ష, అసెస్మెంట్ నివేదికలో అర్హత సాధిస్తేనే ఎక్స్ కవేషన్ కేటగిరీ–డి నుంచి ఎక్స్ కవేషన్ కేటగిరీ–సికి ఖాళీలను బట్టి పదోన్నతి కల్పించారు. ఎక్స్ కవేషన్ కేటగిరీ–సిలో మూడేళ్లు పనిచేసి ప్రాక్టికల్ పరీక్ష, అసెస్మెంట్ నివేదికలో అర్హత సాధిస్తేనే ఎక్స్‌కవేషన్ కేటగిరీ–సి నుంచి ఎక్స్ కవేషన్ కేటగిరీ–బికి ఖాళీలు ఏర్పడినప్పుడు పదోన్నతులు కల్పించేవారు. ఈ అంశంపై యాజమాన్యం స్పందించి అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ నివేదిక సమర్పించగా సీఎండీ బలరాం ఈనిర్ణయం తీసుకున్నారు. ఖాళీలతో సంబంధం లేకుండా కంపెనీ నిబంధనలను అనుసరించి ప్రమోషన్లు ఇవ్వడానికి అంగీకరించారు.

క్లుప్తంగా

హైమాస్ట్ లైట్లు ప్రారంభించిన ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.కోటి 25 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గురువారం రాత్రి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. స్థానిక రమేశ్‌నగర్, తిలక్‌నగర్, ఫైవ్ ఇంక్లైన్ చౌరస్తా, సింగరేణి స్టేడియం ప్రాంతాల్లో లైట్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్, బల్దియా కమిషనర్ అరుణశ్రీ, పలువురు తాజా మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కూడలికి వన్నె తెచ్చారు


పెద్దపల్లిలోని సుభాష్ కూడలి వద్ద ఆక్రమణల తొలగింపు, హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పెద్దపల్లి పట్టణంలోని సుభాష్‌కూడలిని సుందరీకరించి వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేశారు. ఆ ఫౌంటెయిన్ ఎదుట ఉన్న స్థలాలను కొందరు ఆక్రమించుకోవడంతో ప్రజలకు కనిపించకుండా పోయింది. ఈ నెల 14న సాక్షి దినపత్రికలో 'వన్నె తగ్గిన కూడలి' శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆక్రమణదారులను తొలగించారు. ఆ కూడలిలో ఎటువంటి వ్యాపారాలు పెట్టరాదని, పెడితే మున్సిపల్ చట్టం ప్రకారం వారిపై జరిమానా విధించి తగు చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

కళాశాల గ్రౌండ్‌లో చదును పనులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బురదమయం కావడంతో 'సాక్షి' దీనిపై కథనం ప్రచురించింది. దీంతో మున్సిపల్ కమిషనర్ రమేశ్ గురువారం స్పందించి బురద నీటిని జేసీబీతో శుభ్రం చేయించడంతో పాటు మట్టి పోయడం ప్రారంభించారు. వాకర్స్‌కు, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా శుక్రవారం చదును చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర పంచాయతీరాజ్ మినిస్టీరియల్ విభాగంలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రయత్నిస్తామని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జనగామ నాగరాజు అన్నారు. పెద్దపల్లి జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పదోన్నతికి సంబంధించి దాదాపు ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా నాగరాజును సత్కరించారు. రంగు రవి, మనోహర్‌రెడ్డి, రమేశ్, ప్రవీణ్, రాజిరెడ్డి, ఉపేందర్ ఉన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ముత్తారం: అండర్–17 వాలీబాల్ పోటీల్లో ముత్తారం జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎం.జ్యోతిక, సీహెచ్ శృతి, వినోద్, అండర్–14 విభాగంలో ఎం.ఇంద్రజిత్, కె.శ్రీజ, ఎస్.కీర్తన, ఎ.సహస్ర జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీలో ఆర్.సాయిరిత్విక ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

టీబీ నిర్ధారణ పరీక్షలు

పెద్దపల్లిరూరల్: టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యదర్శి ఝాన్సీతో పాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ


బ్యాగు అప్పగిస్తున్న ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ, ఎస్సై


ఆటోడ్రైవర్‌ను సత్కరిస్తున్న పోలీసులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన అశోక్‌రెడ్డి, విజయ దంపతులు ఊరికి వెళ్లేందుకు బుధవారం ఆటోలో బయల్దేరారు. బస్టాండ్‌లో బస్సు సిద్ధంగా ఉండడంతో తమతో పాటు తెచ్చుకున్న బ్యాగును ఆటోలో మర్చిపోయి బస్సు ఎక్కారు. కాసేపటికి వెంటనే వెనక్కి వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రయాణించిన ఆటో గురించి ఆరా తీశారు. పెద్దపల్లి మండలం కొత్తపల్లికి చెందిన కలవేన ఓదెలుకు చెందిన ఆటోగా గుర్తించి ఫోన్ చేశారు. ఆటోలో బ్యాగు ఉందని డ్రైవర్ ఓదెలు చెప్పి పోలీసులకు అప్పగించాడు. బ్యాగు పోగొట్టుకున్న బాధితులకు ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై లక్ష్మరావు అందజేశారు. బ్యాగులో 15తులాల బంగారం, రూ.లక్ష నగదు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిజాయితీగా వ్యవహరించిన ఆటోడ్రైవర్ ఓదెలుకు నగదు బహుమతి అందించి సన్మానించారు. అలాగే సత్వరమే స్పందించిన హెడ్‌కానిస్టేబుల్ మాడిశెట్టి రమేశ్‌ను పోలీసులు సత్కరించారు.

సింగరేణి క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గురువారం జీఎం నరేంద్ర సుధాకర్‌రావు ఆదేశాల మేరకు క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. 168 ఖాళీ క్వార్టర్లు ఉండగా ఫ్రెష్ అలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ కోసం 56మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ఎస్‌వోటూ జీఎం ఎం.రాంమోహన్ తెలిపారు. 8 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారని, వారికి త్వరలోనే అలాట్‌మెంట్ లెటర్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రాంచంద్రారెడ్డి, టి.మల్లిక, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, మెడికల్ సూపరింటెండెంట్ కళ్యాణ్ చక్రవర్తి, డీవైపీఎం వి.సునీల్‌ప్రసాద్, సివిల్ విభాగం అధికారి ఫణీంద్ర, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సీఎండీపై ఏఐటీయూసీ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సింగరేణి మాదిగ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సీఎండీపై ఏఐటీయూసీ నాయకుడు చేసిన వాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిచో సింగరేణి ఏఐటీయూసీ ఆఫీసులు ముట్టడిస్తామని సింగరేణి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దుర్గాప్రసాద్ తెలిపారు.

ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధికి దాతలు సహకరించాలి


ఫ్రిడ్జ్ అందజేస్తున్న దాతలు

కాల్వశ్రీరాంపూర్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు, పూర్వ విద్యార్థులు సహకరించాలని ఎంఈవో సిరిమల్ల మహేశ్‌కుమార్, హెచ్‌ఎం ఈర్ల సమ్మయ్య కోరారు. మండలంలోని ఊశన్నపల్లె ప్రభుత్వ పాఠశాలకు ఇఫ్కో కిసాన్ ఫైనాన్స్ సంస్థ ఏరియా మేనేజర్ పెండ్లి సతీశ్‌రెడ్డి, మేనేజర్ కూస రంజిత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కదురు మానస సతీశ్ రెడ్డి, నాయకులు కూస సతీశ్ గురువారం పాఠశాలకు రూ.65వేల విలువ గల ఫ్రిడ్జ్ అందజేశారు. ఉపాధ్యాయులు సురేశ్‌కుమార్, మాజీ వార్డుసభ్యులు ఆవుల తిరుపతి, ముస్కు సంపత్‌రెడ్డి, పెండ్లి సాయికిరణ్, పైడిపెల్లి సతీశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• తేనెటీగెల పెంపకంపై శిక్షణ

గోదావరిఖని: తేనెటీగెల పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత తేనెటీగల కిట్లు, వాటికి సంబంధించిన బాక్స్‌లు, రక్షణ శిరస్త్రాణాలు, చేతి తొడగులు ఇతర పరికరాలు శిక్షణ తర్వాత అందజేయనున్నట్లు వివరించారు. ఎంపిక చేసిన వంద మందికి మాత్రమే ఉచితంగా శిక్షణ ఇచ్చి మెలకువలు నేర్పిస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు 25లోగా ఆర్జీ–1 జీఎం కార్యాలయం పర్సనల్ విభాగంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

• డివైడర్‌ను ఢీకొట్టిన బైక్.. చికిత్స పొందుతూ మృతి

రామగుండం: రామగుండం నుంచి ఐటీసీ వైపు బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. రామగుండం ఎస్సై గుండేటి సంధ్యారాణి వివరాల మేరకు.. ఓ వ్యక్తి గురువారం రామగుండం బైపాస్ నుంచి ఐటీసీ వైపు బైక్‌పై వెళ్తుండగా మల్యాలపల్లి సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌కు ఢీకొన్నాడు. స్థానికులు 108కు సమాచారం అందించారు. అతడిని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించే క్రమంలోనే మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని గోదావరిఖని మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే 87126 56525 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

• ఆర్నెళ్లకోసారి స్కానింగ్ చేసుకోవాలి

సుల్తానాబాద్: మహిళలందరూ 6నెలలకు ఒకసారి తప్పనిసరిగా స్కానింగ్ చేసుకోవాలని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ రమాదేవి సూచించారు. యుక్త వయసు బాలికలతో పాటు మహిళలకు స్వస్థ్ నారీ పరివార్ అభియాన్, వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం చిన్నపిల్లలకు, మహిళలకు పలు పరీక్షలు చేశారు.

• దరఖాస్తులు ఆహ్వానం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ ఖాజీపల్లిలోని మండల పరిషత్ పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో పనిచేయడానికి టీచర్, ఆయా పోస్టులకు 21లోగా దరఖాస్తు చేసుకోవాలని హెచ్‌ఎం బొమ్మన సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్ పోస్టుకు విద్యార్హత ఇంటర్, ఆయాగా పనిచేసే వారికి ఏడో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు.

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని చీకురాయిరోడ్, హనుమాన్‌టెంపుల్, బీసీహాస్టల్ ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 దాకా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

• రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ

ముత్తారం: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ప్రతీ గ్రామానికి రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు రైతువిజ్ఞాన కేంద్రం కరీంనగర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రాజేందర్‌ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని దరియాపూర్, హరిపురం, ముత్తారంలో క్షేత్రస్థాయిలో వరి, పత్తి పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ముగ్గురు చొప్పున రైతులకు వరి, పెసర, పత్తి నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేశారు. ఏవో అనూష, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

• 23, 24వ తేదీల్లో జేఎన్టీయూలో పోటీలు

రామగిరి: నెహ్రూ యువ కేంద్రం, మైభారత్ ఆధ్వర్యంలో ఈనెల 23, 24 తేదీల్లో మంథని జేఎన్టీయూ కళాశాలలో బ్లాక్‌స్థాయి రామగిరి, కమాన్‌పూర్ మండలాలకు చెందిన యువ క్రీడాకారులకు పలు పోటీలు నిర్వహించనున్నట్లు డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ ఎం.వెంకటరాంబాబు, టోర్నీ నిర్వాహకులు మహేశ్ గురువారం తెలిపారు. పురుషులకు వాలీబాల్, కబడ్డీ, 400 మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్, షటిల్ బాడ్మింటన్, చెస్, మహిళలకు షటిల్ బాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రెండు మండలాలకు చెందిన 15 నుంచి 29 ఏళ్ల వయస్సు గలవారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, ఈ నెల 22న సాయంత్రం 5గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 90598 18383, 79936 04489 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

• పాఠశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హర్యానాకు చెందిన జానపద గీతాలకు నృత్యాలు చేయగా, వంటకాలను సైతం ప్రదర్శించారు. అనంతరం గతంలో స్కూల్‌లో పని చేసి ప్రమోషన్‌పై వెళ్లిన టీచర్లు వెంకటేశ్వర్లు, బదిలీపై వెళ్లిన రవిప్రసాద్‌ను సన్మానించారు.

• మహాసభలు విజయవంతం చేయాలి

పెద్దపల్లిరూరల్: కార్మికరంగ సమస్యలపై రాజీలేని పోరాటం సాగిస్తూ సీఐటీయూ కార్మికులకు అండగా నిలుస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజారెడ్డి అన్నారు. జిల్లా కార్యదర్శి ముత్యంరావుతో కలిసి పెద్దపల్లిలోని కార్యాలయంలో గురువారం కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. నవంబర్ 15, 16వ తేదీల్లో నిర్వహించే జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

• దుద్దిళ్ల కుటుంబాన్ని విమర్శిస్తే సహించేది లేదు

రామగిరి: నిత్యం ప్రజా శ్రేయస్సు, సంక్షేమం కోసం పాటుపడుతున్న దుద్దిళ్ల కుటుంబాన్ని విమర్శిస్తే సహించేది లేదని ఐఎన్టీయూసీ ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సెంటినరికాలనీలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుద్దిళ్ల కుటుంబం ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే ఓర్వలేక ఇష్టారీతిన మాట్లాడుతున్నారన్నారు.

• ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మంథని: రాష్ట్ర, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న పలువుర్ని గురువారం సన్మానించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంఈవో దాసరి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను సత్కరించారు. మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీవో అనిల్‌రెడ్డి, టీజీఈఆర్సీ సలహాదారు శశిభూషణ్ కాచే, ఆర్టీఏ మెంబర్ మంథని సురేశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఈదులపల్లి నరసింహారావు, సురేశ్‌కుమార్, మోసం శ్రీనివాస్ ఉన్నారు.

బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



కమాన్‌పూర్: కరీంనగర్‌లో ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. బి.బిందు గోల్డ్ మెడల్, డి.అక్షయ సిల్వర్, పి.శశిరేఖ సిల్వర్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థినులను, ఫిజికల్ డైరెక్టర్ బి.రేణుకను ఏంఈవో విజయ్‌కుమార్ అభినందించారు.

దంత వైద్యసేవలను వినియోగించుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనిత

సుల్తానాబాద్‌రూరల్: ప్రజలు దంత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని గర్రెపల్లి పీహెచ్‌సీ వైద్యులు ఉదయ్‌కుమార్, దంత వైద్యురాలు అనిత సూచించారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్వాస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ప్రజలకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు సూచించారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో గురువారం విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం


మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మికుల లాభాల వాటా త్వరగా చెల్లించాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లాగౌడ్ డిమాండ్ చేశారు. ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–1, జీడీకే–11వ గనిపై గురువారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 19న సింగరేణివ్యాప్తంగా ఉన్న అన్ని జీఎం ఆఫీసుల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్మికులకు 35శాతం చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.వా జీఎం ఆఫీస్ ఎదుట జరిగే ధర్నాలో కార్మికవర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఆరెల్లి పోశం, మహేశ్, అశోక్, చక్రపాణి, మల్లికార్జున్, శంకర్, రవి, నరేశ్ పాల్గొన్నారు.

దసరాకు ముందే లాభాల వాటా చెల్లించాలి


మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: కార్మికులకు రావాల్సిన లాభాల వాటా పంపిణీలో జాప్యం చేస్తే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం వార్షిక లాభాలను వెంటనే ప్రకటించి అందులో 35శాతం కార్మికుల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. దసరాకు ముందే లాభాల వాటా ప్రకటించాలని కోరారు. వేలంలో పాల్గొనాలని, గనులు మూత పడతాయని చెప్పి కార్మికులను భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. ఈ విషయంపై శుక్రవారం హైదరాబాద్‌లో సంస్థ సీఎండీకి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, మాదాసి రామ్మూర్తి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, జావిద్ పాషా, పానుగంటి సత్తయ్య పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతారా?

రామగిరి: కమాన్‌పూర్ మండలంలోని పెంచికల్‌పేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణపై కాంగ్రెస్ వైఖరి సరికాదని తెలంగాణ బొగ్గు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కోల్ కారిడార్ చౌరస్తాలో గురువారం అంబేడ్కర్, పూలే విగ్రహాలకు ఆర్జీ–3 ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్యతో కలిసి క్షీరాభిషేకం చేశారు. 15న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో విగ్రహావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేయగా రాత్రికి రాత్రి దొంగతనంగా ముసుగును తొలగించడం అంబేడ్కర్‌ను అవమానించడమే అని అన్నారు. ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు కాంగ్రెస్ నాయకుల తీరును ప్రశ్నిస్తే ఆయన ఇంటిపై దాడికి వెళ్లడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ పింగళి సంపత్‌రెడ్డి, సెంట్రల్ కమిటీ నాయకులు కేశవరావు, దేవ శ్రీనివాస్, ఇసంపల్లి రమేశ్, పాశం శ్రీనివాసరెడ్డి, దాసరి మల్లేశ్, వీరగోని సంతోష్‌గౌడ్, అల్లం తిరుపతి, బుద్దె ఉదయ్, గాండ్ల సతీశ్ ఉన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


చెస్ పోటీలను ప్రారంభిస్తున్న పీవో రాజశేఖర్

రామగిరి: క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని ఓసీపీ–1 ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్ అన్నారు. రామగుండం–3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని వర్క్‌పీపుల్ స్పోర్ట్స్–గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలోని సీఈఆర్ క్లబ్ నందు ఆర్జీ–3, ఏపీఏ భూపాలపల్లి ఏరియాల క్రీడాకారుల మధ్య రీజినల్ స్థాయి క్యారమ్స్, చెస్ పోటీలను పీవో ప్రారంభించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవో పి.రాజేశం, గౌరవ కార్యదర్శి సాయిస్వరూప్, స్పోర్ట్స్ అసిస్టెంట్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ అంజయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

సింగరేణిలో రాజకీయ జోక్యం


మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రామగిరి: సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యంతో సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ కె.రాజ్‌కుమార్ అన్నారు. ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2లో బ్రాంచ్ సెక్రటరీ ఎం.రాంచంద్రారెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం మొండి వైఖరితో స్ట్రక్చరల్ సమావేశం బహిష్కరించామని, అంగీకరించిన డిమాండ్లపై సర్క్యులర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 35శాతం లాభాల వాటా ప్రకటించాలని, సొంత ఇంటి పథకం అమలు చేయాలని కోరారు. మారుపేర్ల సమస్యపై యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. 19న జీఎం కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డిప్యూ టీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్.ప్రకాశ్, సెంట్రల్ సెక్రటరీ జూపాక రాంచందర్, వైస్ ప్రెసిడెంట్ క్రాంతి, నాయకులు పోచయ్య, సంపత్, సురేశ్, గంగాధర్, రాజు, చారి, వెంకటేశ్వర్లు వెంకటస్వామి, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నల్లా కనెక్షన్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఇక నుంచి నల్లా కనెక్షన్ పొందడం చాలా సులభతరమని మున్సిపల్ కమిషనర్ జె.అరుణశ్రీ తెలిపారు. ఆఫీసు రాకుండా ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో కొత్తగా నల్లా కనెక్షన్ పొందవచ్చన్నారు. గురువారం ఆన్‌లైన్ ద్వారా నల్లా కనెన్షనకు దరఖాస్తు చేసుకునే విధానంపై వివరించారు. మొదటి దశలో స్మార్ట్ ఫోన్ లేదా కంప్యూటర్‌లో https://cdma.cgg.gov.in/cdma&wt/ WaterTap /NewWaterTapConnection వెబ్‌సైట్ లింక్ మీద క్లిక్ చేసి ఫోన్‌నంబర్‌ను ఓటీపీ ద్వారా ధ్రువీకరించుకోవాలి. తర్వాత నల్లా కనెక్షన్ కావాల్సిన ఇంటి అస్సెస్‌మెంట్, లొకేషన్, కనెక్షన్ వివరాలు పూరించాలి. ఆస్తి పన్ను రశీదు, ఆహార భద్రత కార్డు తదితర సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి. అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత దరఖాస్తును మున్సిపల్ కమిషనర్‌కు పంపుతారు. కమిషనర్ ఆమోదం పొందిన తర్వాత, నీటి కుళాయి కనెక్షన్ రుసుము చెల్లింపు కోసం దరఖాస్తుదారుకు ఎస్ఎంఎస్ పంపిస్తారు. దరఖాస్తు చేసిన 14 రోజుల లోపు ఈ ప్రక్రియ ముగుస్తుంది.

ఓటరు జాబితాను సవరించాలి

ఓదెల: ఓటరు జాబితాను సవరించాలని తహసీల్దార్ ధీరజ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు.

రాజకీయ భిక్ష పెట్టిన వారిపై విమర్శలు సరికాదు


మాట్లాడుతున్న తోట్ల తిరుపతియాదవ్

రామగిరి: రాజకీయ భిక్ష పెట్టిన శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావును మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించడం సరికాదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ అన్నారు. మండలంలోని సెంటినరికాలనీ శ్రీపాదభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్నతో కలిసి ఆయన మాట్లాడారు. స్పీకర్ పదవికి వన్నె తెచ్చిన గొప్ప నాయకుడు శ్రీపాదరావును విమర్శించే ముందు పుట్ట మధు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. అనంతరం మార్కెట్ చౌరస్తాలోని అంబేడ్కర్, పూలే విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ డైరెక్టర్లు సిద్దం మురళీకృష్ణ, ప్రవీణ్, కాటం సత్యం, చిందం మహేశ్, ముస్త్యాల శ్రీనివాస్, మైదం వరప్రసాద్, ఎల్లె రాంమూర్తి, మహేశ్వరరావు, కండె పోచం, బండారి సదానందం, పుల్లెల కొమురయ్య, మట్ట రాజ్‌కుమార్, బొగె ప్రకాశ్, మల్లేశ్ పాల్గొన్నారు.